

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | ఆదివారం | 11-10-2026 | సంపుటి: 3 | సంచిక: 247 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 11-10-2026 | VOLUME : 3 | ISSUE : 247 | PAGES: 8 | COST: 2/- |

# తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ప్రారంభం

- తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు.. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, చిన్నారుల సందడి
- తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు
- రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు జిల్లాల్లో ఉత్సాహంగా ఉత్సవాలు
- పండుగ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

2



ఆడబిడ్డల ఆత్మీయ వేడుక బతుకమ్మ పండుగ 2



## దిల్లీ అంతటా నిర్బంధాల పర్వం

- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత
- విమానంలోనే కాక్రోచ్ జనతా పార్టీ నేతల నిర్బంధం
- వేలాదిమంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నేతలపై చర్యలు
- ధ్రువ్ రాఠీ, విద్యార్థులు, జర్నలిస్టుల నిర్బంధం
- 45 మెట్రో స్టేషన్లపై ఆంక్షలు, వందలాది రైళ్లకు అంతరాయం
- పోలీసు చర్యలపై దేశవ్యాప్త విమర్శలు
- ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలు

4



## దేశంలో ప్రజాస్వామ్యం లేదా?

- ఢిల్లీలో కేంద్రం ఆంక్షలపై ప్రియాంకా గాంధీ ప్రశ్న
- మోదీ, అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోంది

4

## విమానంలో సీజేపీ నేతలకు అవమానం..

- తోటి ప్రయాణికుల నుంచి వ్యతిరేకత!
- సోషల్ మీడియా వీడియో షేర్ చేసిన బీజేపీ ఎంపీ
- "పౌరుల ద్వారానే చెత్త నియంత్రణ" అంటూ కామెంట్



4



# కొవిడ్ తరహాలో ఎల్ నినో ఎఫెక్ట్

- ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తం
- ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- జూన్ వరకు తాగు, సాగునీటితోపాటు విద్యుత్ సమస్యలపై పక్కా వ్యూహం
- కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా మార్కెట్లో విద్యుత్ కొరత
- చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టండి
- సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**
ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శనివారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయి

మిగతా 2వ పేజీలో..



## 12న ఢిల్లీకి తరలిరండి

- నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం పిలుపు

2

## దేశ ప్రగతికి ఎంఎస్ఎంఈలే ప్రధాన చోదక శక్తులు

- జీడీపీలో 32%, ఎగుమతుల్లో 49% వాటా చిన్న పరిశ్రమలదే
- 40 కోట్లకుపైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న లఘు పరిశ్రమలు
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనలో ఏంఎస్ఎంఈల పాత్ర కీలకం
- 'లఘు ఉద్యోగ్ భారతి – సౌత్ ఇండియా కాంక్లేవ్'లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**
దేశంలో ఉద్యోగ కల్పనతోపాటు 2047 నాటికి వికసిత్ భారత్‌గా రూపుదిద్దడంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎంఈలు) కీలకమైన ఇంజిన్‌గా వ్యవహరిస్తాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం పెద్ద పరిశ్రమల ద్వారానే కాక గ్రామాలు, పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈలు బలోపేతమైనప్పుడే

మిగతా 3వ పేజీలో..



## ఎంఎస్ఎంఈల కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్



- సమస్యల పరిష్కారానికి నెలకోసారి ఎంఎసఎంఈ గ్రీవెన్స్ డే
- నగరంలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు
- ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

3

సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

3



## సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

- ప్రతీ పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- పార్టీ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు

**ఖమ్మం, అక్టోబర్ 10 :**
ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఖమ్మం

మిగతా 2వ పేజీలో..

## ఉద్యమకారుడి కుటుంబానికి కేటీఆర్ అండ

- ముగ్గురు కుమార్తెలకు రూ.9 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు
- కుటుంబ ఖర్చుల కోసం భార్యకు రూ.లక్ష ఆర్థిక సహాయం
- జనార్ధన్ కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

2



## ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ కూటమి హవా

- అధికార టీడబ్ల్యూయూకు కార్మికుల షాక్!
- ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘనవిజయం
- కాంగ్రెస్, టీఆర్ఎస్ అనుబంధ టీఎంయూలకు నిరాశ
- 17న వెలువడనున్న రీజియన్ల వారీ అధికారిక ఫలితాలు

2



రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక




# ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ కూటమి హవా

- అధికార టీడబ్ల్యూయూకు కార్మికుల షాక్!
- ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘనవిజయం
- కాంగ్రెస్, టీఆర్ఎస్ అనుబంధ టీఎంయూలకు నిరాశ
- 17న వెలువడనున్న రీజియన్ల వారీ అధికారిక ఫలితాలు

**హైదరాబాద్, ప్రజాతంత్ర, అక్టోబర్ 10:**

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రాథమిక వివరాలు, అందిన సమాచారం ప్రకారం ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలోని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కూటమి రాష్ట్రస్థాయి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి సంస్థపై పట్టు నిలుపుకుంది. కాగా, ప్రభుత్వం బాహాటంగా అండదండలు అందించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు కార్మికులు గట్టి షాక్ ఇవ్వడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే రీజియన్లు, నాన్ ఆపరేటింగ్ యూనిట్లలో స్థానిక గుర్తింపు ఎవరికి దక్కిందనే విషయంలో ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) మూడు రీజియన్లు, టీడబ్ల్యూయూ ఐదారు రీజియన్లలో స్థానిక గుర్తింపు దిశగా ఆధిక్యంలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. రీజియన్ల వారీగా తుది అధికారిక ఫలితాలను ఈ నెల 17న ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ.. అశ్వత్థామరెడ్డి, మొగుళ్ల రాజిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న టీడబ్ల్యూయూకు బాహాటంగానే మద్దతు పలికింది. పార్టీ తరపున ఎన్నికల ఇన్‌చార్జిగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను రంగంలోకి దించి విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. అయినప్పటికీ వెలువడుతున్న ఫలితాలు అధికార పార్టీకి శరాఘాతంగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం అండగా నిలిచినా కార్మికులు మాత్రం సంప్రదాయ జేఏసీ పక్షానే మొగ్గు చూపినట్లు తేటతెల్లమవుతోంది. ఎన్నికల్లో ప్రతిపక్షబీఆర్ఎస్ పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. బీఆర్ఎస్ మద్దతు ఉన్న టీఎంయూ కేవలం ఏడు డిపోలకే పరిమితమై మూడో స్థానానికి పడిపోయింది. ఉద్యమ సమయంలో కార్మికులందరినీ బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘంలో చేర్చినా కాలక్రమేణా కార్మికులు మళ్లీ తమ పాత సంఘాల వైపే వెళ్లడం గమనార్హం. వెలుపల సీపీఐ, కాంగ్రెస్ కూటమిగా ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో మాత్రం రెండు పార్టీల అనుబంధ సంఘాలు విడివిడిగానే పోటీ చేశాయి.



# ఉద్యమకారుడి కుటుంబానికి కేటీఆర్ అండ

**మహబూబాబాద్,అక్టోబర్ 10:**

తెలంగాణ ఉద్యమంలో మానుకోట సంఘటన నుంచి చురుకైన పాత్ర పోషించిన ఉద్యమకారుడు, దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఈదురు జనార్ధన్ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. పేదరికంతో ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ కోసం రోజువారీ కూలీగా పనిచేసిన జనార్ధన్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో కష్టాల్లో పడిన కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. జనార్ధన్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కేటీఆర్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. జనార్ధన్ ముగ్గురు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఒక్కొక్కరి పేరిట రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.9 లక్షల ఫిక్సడ్ డిపాజిట్లు అందించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా జనార్ధన్ సతీమణి ఈదురు మల్లికకు కుటుంబ ఖర్చుల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.లక్ష అందించారు. భవిష్యత్తులో ఆడబిడ్డలకు ఉద్యోగాల కల్పన విషయంలోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేటీఆర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు జనార్ధన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత ఉద్యమకారుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రులు రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల త్యాగాలను గుర్తుంచుకుంటూ, వారి కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం బీఆర్ఎస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. జనార్ధన్ కుటుంబానికి అవసరమైన సమయంలో కేటీఆర్ స్పందించి ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఆయన ముగ్గురు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించారని పేర్కొన్నారు.



# సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

మొదటిపేజీ తరువాయి

నగరంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలంటే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. జిల్లాస్థాయి సమావేశం అనంతరం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌చార్జిగా నియమించి, వారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను గుర్తించి వారంతా ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలన్నారు. అనంతరం తటస్థ ఓటర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న ఇతర వర్గాల పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలని సూచించారు.

**3.42 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని భట్టి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దాదాపు కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3.42 కోట్ల మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించామని, సుమారు 30 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద సుమారు 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సామాజిక భద్రతలో భాగంగా 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో సుమారు 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంతోపాటు ఒక గ్లాసు పాలు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు.

**కాంగ్రెస్‌కు అంకితమైన కుటుంబం నుంచి సర్వోత్తమ్ రెడ్డి**

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి వంటి నాయకుల కుటుంబం పార్టీకి అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ కోసం నిబద్ధతతో పనిచేసిన ఈ కుటుంబాన్ని పార్టీ ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డిని కేవలం ఒక అభ్యర్థిగా కాక పార్టీ ప్రతినిధిగా భావించి ఆయన విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఈ జిల్లా బలమైన పునాది ఉన్న ప్రాంతమని పేర్కొంటూ అదే ఐక్యతను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాటాలని, సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్ట రాగమయి, కోరం కనకయ్యలు ప్రసంగించారు. సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ అధ్యక్షత వహించగా గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం**

ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని, తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే దిశగా ఒక్కో నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున ముందుకు సాగుతున్నామని వివరించారు. హైదరాబాద్‌లోనూ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.40 వేల కోట్లT వెచ్చిస్తున్నదని చెప్పారు. ఇందిరమ్మ జయంతి సందర్భంగా నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కులం, మతం, ప్రాంత భేదాలు లేకుండా కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా పథకాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను కరపత్రాల రూపంలో రూపొందించి ప్రతి ఇంటికీ అందించాలని భట్టి విక్రమార్క నాయకులకు సూచించారు.

# కొవిడ్ తరహాలో ఎల్ నినో ఎఫెక్ట్

మొదటిపేజీ తరువాయి

నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**రాబోయే ఎనిమిది నెలలు కీలకం**

రాబోయే ఎనిమిది నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ఎనిమిది నెలలు ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందంటూ రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలుకు ఎంత ఖర్చు చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని అన్నారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్తును పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతలతోపాటు వివిధ మాధ్యమాల ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



**త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతోపాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తు చేశారు. వీబీ జీ రామ్ జీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తరువాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు సీఎంవో ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**12న దిల్లీకి తరలిరండి**

- నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం పిలుపు

**న్యూదిల్లీ, అక్టోబర్ 10 :**

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన దిల్లీలో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పార్టీ ముఖ్య నాయకులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎసఐఆర్□)లో అక్రమాలు జరిగాయని, అర్హులైన లక్షలాది మంది ఓట్లను తొలగించారని ఆరోపిస్తూ ఇండి కూటమి పక్షాలు దిల్లీలో నిరసనలు చేపడుతున్న విషయం విదితమే. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎసఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలనే డిమాండ్‌తో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల నేతృత్వంలో ఈ ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటంలో సంఘీభావం తెలపడానికి దిల్లీ వేదికగా నిర్వహించే నిరసన ప్రదర్శనలో పాల్గొనడానికి రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ జిల్లా కమిటీల అధ్యక్షులు, టీపీసీసీ ముఖ్య నాయకులు, మంత్రులను కోరారు.

# తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబర్ 10:**

తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలను పేర్చి మహిళలు బతుకమ్మలను అందంగా అలంకరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు.

**బతుకునిచ్చే పండుగ**

తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి పసుపు, కుంకుమలతో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. పెళ్లైన మహిళలు పుట్టింటికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈ పండుగను ఆనందంగా జరుపుకుంటారు. ఇళ్ల ముంగిళ్లు, ఆలయాలు, కూడళ్లు, చెరువు గట్ల వద్ద బతుకమ్మలను ఒకచోట చేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు.

**తొమ్మిది రోజుల వేడుకలు**

ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే ఉత్సవాలు అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ మీదుగా కొనసాగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ప్రత్యేకంగా బతుకమ్మను పేర్చి గౌరీదేవికి సంప్రదాయ నైవేద్యాలు సమర్పిస్తారు.

**రాష్ట్రవ్యాప్తంగా సందడి**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, చప్పట్లు కొడుతూ వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. పండుగ సందర్భంగా పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. వేడుకలు జరిగే ప్రాంతాలు, చెరువు ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతులతో పాటు విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించాయి.

**ఆడబిడ్డల ఆత్మీయ వేడుక బతుకమ్మ పండుగ**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**

తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద పండుగ, సింగిడి రంగుల పూల సంబరం బతుకమ్మ పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి 'ఎక్స'లో మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ ప్రకృతి అందాలను పూలలో కొలువుదీర్చే ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాలను, ప్రతి గుండెలో సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా కోరుకున్నారు.





# ఎంఎస్ఎంఈల కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'

- **సమస్యల పరిష్కారానికి నెలకోసారి ఎంఎసఎంఈ గ్రీవెన్స్ డే**
- **నగరంలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు**
- **ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్ఎంఈలకు మార్గ నిర్దేశం చేస్తామన్నారు. లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో శనివారం నిర్వహించిన ఎల్‌యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎంఎసఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎసఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎసఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ ఎంఎసఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై ఎంఎసఎంఈలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# పరస్పర గౌరవంతోనే ఆరోగ్యకర బంధాలు

- **కోపం, అహంకారాన్ని విడనాడాలి**
- **'స్టాండ్ విత్ హర్' చర్చావేదికలో డీజీ చారు సిన్హా**

**హైదరాబాద్, అక్టోబరు 10:**



కోపం, అహంకారం, ఆధిపత్య ధోరణులతో కూడిన విషపూరిత పురుషాధిక్య భావజాలాన్ని మార్చుకోవాలని సీఐడీ, ఏసీబీ, మహిళా భద్రత విభాగాల డీజీ చారు సిన్హా అన్నారు. పురుషులు అలవర్చుకున్న ప్రవర్తనలను మార్చుకోవడం కూడా సాధ్యమేనని పేర్కొన్నారు. పురుషులు, మహిళలు ఒకరికొకరు పరస్పర పూరకాలని, ఎవరూ ఎక్కువ లేదా తక్కువ కాదని స్పష్టం చేశారు. 'స్టాండ్ విత్ హర్' ప్రచారంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని వీహబ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఎనిమిదో చర్చావేదికలో ఆమె మాట్లాడారు.

**భావోద్వేగాలను నియంత్రించుకోవాలి**

వాదన జరిగినప్పుడు భావోద్వేగాలను అదుపులోకి తెచ్చుకునేందుకు కొంత సమయం తీసుకోవడం మంచిదేనని అనూష సూచించారు. అయితే, తనకు కొంత సమయం అవసరమని ఎదుటివారికి తెలియజేయకపోతే అపార్థాలు ఏర్పడతాయని చెప్పారు. కుటుంబం, సమాజంలో లింగ వివక్షకు సంబంధించిన పాత భావజాలాన్ని పురుషులతోపాటు మహిళలు కూడా కొనసాగిస్తున్నారని నటి, యాంకర్ ఝాన్సీ పేర్కొన్నారు. ఇలాంటి ధోరణులను ప్రతి ఒక్కరూ గుర్తించి మార్చుకోవాలని సూచించారు.

**క్రీడలతో ఒత్తిడికి దూరం**

కోపాన్ని నిర్మాణాత్మకంగా మళ్లించేందుకు క్రీడలు, శారీరక వ్యాయామాలు దోహదపడతాయని నటుడు వంశీ చాగంటి అన్నారు. విభేదాలు వచ్చినప్పుడు వాదనలో గెలవడం కంటే సంబంధాలను కాపాడుకోవడం ముఖ్యమని కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ పమేలా సత్పతి అన్నారు. మహిళల అభిప్రాయాలు, అనుభవాలను తక్కువగా చూడటం, వారికి తెలిసిన విషయాలను అనవసరంగా వివరించడం వంటి ధోరణులను గుర్తించి మార్చుకోవాలని వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల సూచించారు.

**సమానత్వమే లక్ష్యం**

కోపం, అహంకారం, వివక్షాపూరిత ధోరణులను అధిగమించేందుకు పరస్పర చర్చించుకోవడం, ఇతరుల అభిప్రాయాలకు గౌరవం, స్వీయ నియంత్రణ అవసరమని వక్తలు పేర్కొన్నారు. 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒక అంశంపై చర్చలు నిర్వహిస్తూ లింగ సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక మార్పుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ చర్చలో సీడీఈడబ్ల్యూ, మహిళా భద్రత విభాగానికి చెందిన అనూష, నటి ఝాన్సీ, నటుడు వంశీ చాగంటి, వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల, ఐఏఎస్ అధికారి పమేలా సత్పతి, టీవీ9 సీనియర్ వార్తా వ్యాఖ్యాత దీప్తి వాజ్‌పేయి, పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫలక్ నుమా కాళీ మాత ఆలయంలో వసతులు కల్పించాలి

- **తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత**

**హైదరాబాద్, అక్టోబర్ 10:**

పాతబస్తీలోని ఫలక్ నుమా కాళీ మాత ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వేలాదిగా భక్తులు వచ్చే ఆలయంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవటం విచారకరమన్నారు. కాళీ మాత మందిరాన్ని శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెమీడియాతో మాట్లాడారు. పాత బస్తీలోని కాళి మాత ఆలయమంటే హైదరాబాద్ ప్రజలకు ఎంతో నమ్మకమని, భక్తులకు కొంగు బంగారమని చెప్పారు. అలాంటి ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవని, సరైన రోడ్డు మార్గం లేదని, మహిళలకు వాష్ రూమ్ లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. చుట్టూ రైల్వే స్థలాలు, పక్కనే శ్మశానం ఉండటంతో రోడ్డు వేసే పరిస్థితి కూడా లేదన్నారు. ఎండోమెంట్ డిపార్ట్ మెంట్, అదేవిధంగా రైల్వే అధికారులతో మాట్లాడి ఇక్కడ రోడ్లు వేసేలా, ఆలయంలో వసతులు కల్పించే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.



**బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు**

బతుకమ్మ పండుగ ప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర ప్రజందరికీ కవిత బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్ 'లో ట్వీట్ చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడబిడ్డందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. నాడు రాష్ట్ర సాధనకు బతుకమ్మను సాంస్కృతిక వారధిగా మలుచుకున్న మనమంతా ఇప్పుడు సకల జనుల వికాసం, బహుజన తెలంగాణ సాధన కోసం బతుకమ్మలో గౌరమ్మలా ఒదిగి కలిసి పనిచేద్దామన్నారు.

# కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- **వరుస ఓటములతో భయపడిన రాహుల్**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**

రాష్ట్రంలో ఇటీవల పూర్తయిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆల్ సెల్స్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా బోగస్ ఓట్లను తొలగించి పారదర్శకంగా జాబితాను రూపొందిస్తే వరుస ఎన్నికల ఓటములతో భయపడిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఓట్ చోరీ నాటకాలను ఎండగడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి చేకూరే ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తోందన్నారు. ఎసఐఆర్‌పై వీళ్లు సాగిస్తున్న దుష్ప్రచారానికి హద్దు, అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. నిన్న కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్రపతిని కలిసిన తర్వాత రాహుల్ గాంధీ మీడియా ముందు ఇంకో కొత్త నాటకానికి తెరలేపారని, తాము చెప్పిన ఆరోపణలకు రాష్ట్రపతి ఆధారాలు అడిగారని చెప్పారని, చేతిలో ఒక్క ఆధారం కూడా లేకపోయినా చివరకు రాష్ట్రపతి ఓటు చోరీని ఒప్పుకున్నారంటూ ప్రచారం మొదలుపెట్టారని విమర్శించారు. ఆధారాలు చూపించలేక అబద్ధాలను అంటగట్టడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. సెకండ్ ఫేజ్ ఎస్ఐఆర్ అనేది 45 నెలలపాటు సాగే సుదీర్ఘమైన ప్రక్రియ. మొదట బూత్ లెవల్ అధికారులు స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు పరిశీలించి చనిపోయిన, వలస వెళ్లినవారి పేర్లను తనిఖీ చేసిన తర్వాతే ముసాయిదా లిస్ట్ ఇస్తారన్నారు. ఆ తర్వాత సమ్మరీ లిస్టుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే టైప్, ప్రింట్ లేదా చేత్తో రాసి కూడా ఫారమ్7 అందజేయవచ్చు. దీనిపై ఈఆర్‌వో స్థాయి అధికారి పూర్తి విచారణ చేస్తారు.. అన్ని పార్టీల బీఎల్ఏలకు నోటీసులు ఇచ్చిన తర్వాతే పేర్ల తొలగింపులు జరుగుతాయి అని తెలిపారు. ఒకవేళ తొలగింపు తర్వాత కూడా ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసి క్లెయిమ్ చేసుకుంటే మళ్లీ పేరును చేర్చడానికి కూడా స్పష్టమైన పద్ధతి ఉందన్నారు. ఇంత పకడ్బందీగా జరిగే ఎసఐఆర్‌లో ఏకపక్షంగా పేరు తొలగింపు ఉండదన్నారు. ఒక్కరైనా ముందుకొచ్చి తమ పేరు డిలీట్ అయిందని చూపించారా అని ప్రశ్నించారు. ఏ ఆధారం లేనప్పుడు అసలు ఓట్ చోరీ ఎక్కడ జరిగినట్లు.. కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి అని రామచందర్‌రావు డిమాండ్ చేశారు.



# దేశ ప్రగతికి ఎంఎస్ఎంఈలే ప్రధాన చోదక శక్తులు

**మొదటిపేజీ తరువాయి**

దేశ అభివృద్ధి వేగవంతమవుతుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'లఘు ఉద్యోగ్ భారతి - సౌత్ ఇండియా కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎంఎస్ఎంఈలు దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశ జీడీపీలో 32%, తయారీ రంగ ఉత్పత్తిలో 36%, ఎగుమతుల్లో 49% వాటా కలిగి ఉన్నాయని వెల్లడించారు. 'ఉద్యమ' ప్లాట్‌ఫాంపై దాదాపు 9.80 కోట్ల ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయని, ఇవి 40 కోట్లకుపైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఇందులో 37% సంస్థలు మహిళల యాజమాన్యంలో నడవడం విశేషమన్నారు.

**కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ఎదుగుదలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించిందన్నారు. స్టార్టప్‌లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, క్రెడిట్ గ్యారంటీ ఫండ్, పీఎం విశ్వకర్మ, ముద్ర, గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్(జీఈఎం) వంటి అనేక పథకాల ద్వారా ఆర్థిక సాయం, రుణ సదుపాయాలను అందిస్తున్నట్లు వివరించారు. ఎంఎస్ఎంఈలకు అవసరమైన ఫైనాన్స్ అందించేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**ఉత్పత్తి రంగానికి దక్షిణ భారత్ హబ్**

దక్షిణ భారతదేశం ఆటోమొబైల్, ఫార్మా, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా మారిందని కొనియాడారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే ప్రముఖ సెల్ ఫోన్ తయారీ కేంద్రంగా మారిందని, ఐఫోన్లు కూడా ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

**ప్రతిపక్షాలపై ధ్వజం**

ప్రపంచమంతా భారత ఆర్థిక వ్యవస్థను పొగుడుతుంటే, కొందరు ప్రతిపక్ష నేతలు విదేశీ వేదికలపై ఇండియన్ ఎకానమీ డెడ్ అని మాట్లాడుతూ దేశ పరువు తీస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ స్వార్థం కోసం పెట్టుబడులను, యువత ఉపాధి అవకాశాలను పణంగా పెట్టవద్దని హితవు పలికారు. 2014 ముందు నాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం దేశంలో విద్యుత్ కోతలు లేవని, విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలు, ఉత్పాదక రంగం భారీగా విస్తరించాయని ఆయన స్పష్టం చేశారు.

# సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

- **ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**

సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. 'కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక', ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థు ఆధ్వర్యంలో రూపొందించిన 'భాగవతామృతం' (దృశ్యశ్రవణ పద్యకథా మాలిక) మొదటి సంచికను బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నకొద్దీ సమాజంలో నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన తగ్గుతోందన్నారు. ఇలాంటి తరుణంలో మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భాగవతంలోని పద్యాలు, వాటి అంతరార్థాన్ని పిల్లలు, యువతకు సులభంగా అర్థమయ్యేలా ఆహ్లాదకరమైన సంగీతం, ఆకట్టుకునే దృశ్యరూపకంతో 'భాగవతామృతం' పేరిట అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. విజ్ఞానంతోపాటు విలువలనూ పెంపొందించే ఇలాంటి తరహా సృజనాత్మక ప్రయోగాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. భాగవతాన్ని ప్రతి ఇంట్లో వినపడేలా చేసేందుకు కృషి చేసిన కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ నిర్వాహకులను, గాయకుడు నేమాని పార్థును మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గనుల శాఖ ప్రత్యేక అధికారి బీఆర్వీ సుశీల్ కుమార్, భోగరాజు మూర్తి, పార్థు నేమాని తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రాధాన్యం

- **ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి**
- **కొరియా తరహాలో క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా అడుగులు**
- **ఐజీపీఎల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**



రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతోపాటు యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఎన్‌డీటీవీ, ఏఎం గ్రీన్, ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ శనివారంనాటి ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని తెలంగాణకు ముఖ్యమంత్రి ఆహ్వానించారని, మెస్సీ ఫుట్‌బాల్ ఆడటంతోపాటు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా వెలువడిందని గుర్తు చేశారు. దక్షిణ కొరియా వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాలు క్రీడల్లో వందలాది పతకాలు సాధిస్తున్న తీరును పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారని తెలిపారు. ఒకే విశ్వవిద్యాలయం వంద పతకాలు సాధించడం వెనుక ఉన్న శిక్షణా విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహకాలను అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి దక్షిణ కొరియాలోని ఆ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వైస్ ఛాన్సలర్‌తోపాటు క్రీడా అధికారులతో చర్చలు జరిపారని తెలిపారు. తెలంగాణ విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు ఆ విశ్వవిద్యాలయంతో ఎంఓయూ కుదుర్చుకోవాలని కోరినట్లు తెలిపారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్సుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రాంతానికి సమీపంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ నిర్వహించడం నగరానికి మరింత ప్రాచుర్యం తీసుకొస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో కొనసాగుతున్న గోల్ఫ్ కోర్సును క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.

**విజేతలకు అభినందనలు**

ఐజీపీఎల్ టోర్నమెంట్‌లో పతకాలు, విజయాలు సాధించిన క్రీడాకారులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎన్‌డీటీవీ ప్రతినిధులు, తన మిత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, భాస్కర్ రెడ్డిలు ప్రత్యేకంగా ఆహ్వానించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు రావడానికి ఐదు నుంచి ఐదున్నర గంటల సమయం పడుతుందని, అయినప్పటికీ ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని వచ్చానని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ఉప ముఖ్యమంత్రి భట్టి అందజేశారు.

# సౌత్ ఆఫ్రికాలో బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**

దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోహాన్నెస్‌బర్గ్ నగరంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడి, పాడారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సైతం ఘనంగా చాటుతున్న ప్రవాస తెలంగాణ మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య ఈ వేడుకలు కొనసాగాయి. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు.

ఆంధ్ర రాజముద్ర www.rajamudranews.com తెలుగు దిన పత్రిక

# ఢిల్లీ అంతటా నిర్బంధాల పర్వం

- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత
- విమానంలోనే కాక్రోచ్ జనతా పార్టీ నేతల నిర్బంధం
- వేలాదిమంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నేతలపై చర్యలు
- ధ్రువ్ రాఠీ, విద్యార్థులు, జర్నలిస్టుల నిర్బంధం
- 45 మెట్రో స్టేషన్లపై ఆంక్షలు, వందలాది రైళ్లకు అంతరాయం
- పోలీసు చర్యలపై దేశవ్యాప్త విమర్శలు
- ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), విద్యార్థి, యువజన సంఘాలు శనివారం దేశ రాజధాని దిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. జంతర్‌మంతర్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించాలని నిరసనకారులు పిలుపునివ్వగా, కార్యక్రమం ప్రారంభానికి ముందే పోలీసులు నగరాన్ని విస్తృత భద్రతా వలయంలోకి తీసుకున్నారు. ప్రధాన రహదారులపై బారికేడ్లు, మెట్రో స్టేషన్లలో ఆంక్షలు, రైళ్ల రద్దు, మొబైల్ ఇంటర్నెట్ నిలిపివేతతో దిల్లీలో సాధారణ జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. నిరసనకారులు జంతర్‌మంతర్‌కు చేరుకోకుండా అడ్డుకోవడమే కాకుండా పలువురు రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులైన పౌరుల వోటు హక్కుకు భంగం కలుగుతోందని ప్రతిపక్షాలు, సీజేపీ ఆరోపిస్తున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ వోటర్ల జాబితాల ప్రక్షాళన చట్టబద్ధమైన ప్రక్రియేనని వివరిస్తోంది. ఈ వివాదమే శనివారం నిరసనలకు ప్రధాన కారణమైంది.



**విమానం దిగకముందే సీజేపీ నాయకుల నిర్బంధం**

శనివారం ఉదయం చోటుచేసుకున్న అత్యంత ముఖ్యమైన పరిణామం కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సహనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను దిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకోవడం. ముంబయి నుంచి వచ్చిన విమానం దిగిన వెంటనే అధికారులు వారిని నిర్బంధించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వొచ్చాయి. ముగ్గురు నాయకులను అనంతరం వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. దీప్కేను గురుగ్రామ్‌కు, రాంకాను ద్వారకాకు, సౌరవ్ దాస్‌ను మరో ప్రాంతానికి తీసుకెళ్లినట్లు వార్తలు వెల్లడించాయి. నాయకత్వాన్ని నిరసనకు దూరంగా ఉంచడానికే ఈ చర్యలు చేపట్టారని సీజేపీ ఆరోపించింది. నాయకుల నిర్బంధం తర్వాత అజింక్య షిండే నిరసన కార్యకలాపాల సమన్వయ బాధ్యతలు చేపట్టారు. జంతర్‌మంతర్‌కు చేరుకోలేకపోతే పోలీసులు ఎక్కడ అడ్డుకుంటే అక్కడే శాంతియుత నిరసన తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**వేలాదిమంది నిర్బంధం**

రోజంతా దిల్లీలోని కన్నాట్ ప్లేస్, జనపథ్, జంతర్‌మంతర్, ఆకాశవాణి భవన్, మింటో బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నానికి 1,500 మందికిపైగా నిర్బంధానికి గురైనట్లు వార్తలు వెలువడగా, సాయంత్రానికి నాలుగు వేల మందికిపైగా అదుపులోకి తీసుకున్నట్లు కొన్ని ప్రత్యక్ష వార్తా కథనాలు పేర్కొన్నాయి. అదనంగా, నేరచరిత్ర ఉందని పోలీసులు పేర్కొన్న వ్యక్తులను ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వివరించారు.

**మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా పలువురు నేతల నిర్బంధం**

శనివారం నిరసనల్లో ప్రతిపక్ష రాజకీయ నాయకులు కూడా పోలీసు చర్యలకు గురయ్యారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, పార్టీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీలోని సౌత్ అవెన్యూ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న మమతను పోలీసులు అడ్డుకున్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నాయకులను కూడా పోలీసులు నిర్బంధించినట్లు వార్తలు వెల్లడించాయి. వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలు సైతం పోలీసు చర్యలను ఎదుర్కొన్నారు. పోలీసు నిర్బంధాలను ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు.

## ఢిల్లీ నిరసనలపై సుప్రీంకోర్టులో నేడు విచారణ

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ డిమాండ్
- నిరసనలకు పిలుపుతో ఢిల్లీలో ఆంక్షలు.. పలువురు నేతలు, కార్యకర్తల నిర్బంధం
- పోలీసులపై కోర్టు ధిక్కరణ పిటిషన్..
- విచారణకు స్వీకరించనున్న ధర్మాసనం
- • నలుగురు మాజీ సీఎంల నిర్బంధంపైనా హెబియస్ కార్పస్ పిటిషన్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం ఢిల్లీలో భారీ నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో నగరంలో పోలీసులు ఆంక్షలు విధించి పలువురు పార్టీ నేతలు, నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను విమానంలో అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతానికి తరలించినట్లు కథనం పేర్కొంది.

**నిర్బంధాలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు**

ఢిల్లీలో నిరసనల సందర్భంగా విధించిన ఆంక్షలు, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తల నిర్బంధాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఆదివారం, అక్టోబర్ 11న విచారించనుంది. అక్టోబర్ 9న ఇచ్చిన ఆదేశాలను పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారంటూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డి. థారాపై చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కొనసాగించారని పిటిషనర్ ఆరోపించారు. ఈ పిటిషన్‌తో పాటు నిరసనకారుల నిర్బంధాన్ని సవాల్ చేస్తూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించనుంది. జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మెహానాలతో కూడిన ధర్మాసనం ఈ కేసులను పరిశీలించనుంది.

**నలుగురు మాజీ సీఎంల నిర్బంధంపై అభ్యంతరం**

నిరసనల సమయంలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులను కూడా నిర్బంధించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేసేందుకు ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు.

**9న సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

ఢిల్లీలో ఆంక్షలపై అక్టోబర్ 9న విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, 57 మెట్రో స్టేషన్ల మూసివేతతో పాటు ఢిల్లీకి వచ్చే రైళ్ల రద్దుపై వచ్చిన వాదనలను పరిశీలించింది. ప్రజలకు రవాణా సదుపాయాలు పూర్తిగా అందకుండా ఆంక్షలు విధించరాదని స్పష్టం చేసినట్లు కథనం పేర్కొంది. భద్రతా పరిస్థితులను బట్టి మెట్రో, రైల్వే సేవలను నియంత్రించవచ్చని, అయితే వాటిని పూర్తిగా నిలిపివేయకూడదని సూచించినట్లు తెలిపింది.

## సీఈసీ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదు

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్
- ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని పట్టుబాటు
- ముగ్గురు కీలక నేతల అరెస్టుతో ఉద్యమ బాధ్యతలు చేపట్టిన అజింక్య షిండే
- ఆదివారం కూడా ఢిల్లీలో నిరసనలు జరిగే అవకాశం..
- కొనసాగనున్న భద్రత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్పష్టం చేసింది. శనివారం ఢిల్లీలో పోలీసులు విధించిన ఆంక్షల నేపథ్యంలో పార్టీ నేతలు అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను అరెస్టు చేయడంతో ఉద్యమ బాధ్యతలను అజింక్య షిండే చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలిగే వరకు నిరసనలు ఆపబోమని ఆయన విలేకరులకు తెలిపారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను ఉపసంహరించుకోవాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

**ఆదివారం కూడా నిరసనలకు అవకాశం**

ఢిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో ఆదివారం కూడా నిరసనలు జరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. సీజేపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు కూడా ఆందోళనలకు పిలుపునివ్వడంతో భద్రతను కొనసాగించనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. శనివారం నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన 2,000 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితులను బట్టి నిరసన ప్రాంతాల్లో భద్రతా చర్యలను కొనసాగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

## విమానంలో సీజేపీ నేతలకు అవమానం..





- తోటి ప్రయాణికుల నుంచి వ్యతిరేకత!
- సోషల్ మీడియా వీడియో షేర్ చేసిన బీజేపీ ఎంపీ
- ''పౌరుల ద్వారానే చెత్త నియంత్రణ'' అంటూ కామెంట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో అక్టోబర్ 10 శనివారం భారీ నిరసనకు పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలతో సీజేపీ ప్రయత్నాలను వమ్ము చేశారు. ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను విమానంలోనే అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతానికి తరలించారు. ఇదిలా ఉంటే, విమానంలో పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో హైడ్రామా నెలకొంది. తోటి ప్రయాణికుల నుంచి సీజేపీ నాయకులు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఈ వీడియోను పంచుకుంటూ.. ''పౌరుల ద్వారానే చెత్త నియంత్రణ'' అంటూ కామెంట్ చేశారు. ప్రయాణికులు సీజేపీ లీడర్లను ఉద్దేశించి ''మీకు సిగ్గుండాలి'', ''స్వచ్ఛ భారత్, చెత్తను శుభ్రం చేయండి'' అని కామెంట్స్ చేశారు. ఈ వీడియోను ఉద్దేశిస్తూ తేజస్వీ సూర్య.. ''సీజేపీ గురించి నిజమైన పౌరులు ఏంటున్నారో వినండి'' అని కామెంట్ పోస్ట్ చేశారు. వీడియోలో అభిజిన్ తనను అరెస్ట్ చేసుకోండి అంటూ సవాల్ విసురుతూ.. తనపై ఉపా, ఎన్ఎస్ఏ కేసులు పెట్టుకోండి అంటూ నిరసన తెలిపారు. సీజేపీ కోకన్వీనర్ సౌరవ్ దాస్ ఒక మహిళా ప్రయాణికురాలితో ''షేమ్ అన్ యూ'' అంటూ కామెంట్ చేయగా, మహిళ తీవ్రంగా స్పందిస్తూ.. ''షేమ్ ఆన్ యూ'' అని బదులు ఇచ్చింది. మరో ప్యాసింజర్ ''కచరా సాఫ్, స్వచ్ఛ భారత్ అభియాన్''అని అంటుండటం వినొచ్చు. సీజేపీ నేతల అరెస్ట్ డ్రామాతో చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# దేశంలో ప్రజాస్వామ్యం లేదా?

- దిల్లీలో కేంద్రం ఆంక్షలపై ప్రియాంకా గాంధీ ప్రశ్న
- మోదీ, అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోంది

**న్యూదిల్లీ, అక్టోబర్ 10 :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ వైఖరి, వోటర్ల జాబితా సవరణలపై దిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే కేంద్ర ప్రభుత్వం నిరసనలను తీవ్రంగా అడ్డుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. దిల్లీలో సీజేపీ తలపెట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ వ్యతిరేక నిరసనలపై పోలీసులు కఠిన ఆంక్షలు విధించడం, అనుమతి లేదంటూ యువతను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు, యువజన సంఘాల నిరసనకారులపైనా అదే స్థాయిలో నిర్బంధం ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- దిల్లీ దిగ్బంధంపై మండిపాటు

దిల్లీ నగర సరిహద్దులను దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను ఆపేసి, ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తూ అడుగడుగునా తనిఖీల పేరిట సాధారణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజా స్వామ్య సూత్రాలు అమలు కావడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో స్పష్టమైన నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.

- ఓటు హక్కును బలహీనపరిచే యత్నం: జైరామ్ రమేష్

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ కూడా ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న యువతను చూసి కేంద్ర ప్రభుత్వం తీవ్ర భయాందోళనకు గురవుతోందని, అందుకే దిల్లీని ఒక కోటలా మార్చేశారని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం పౌరులకు కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును, రాజ్యాంగ వ్యవస్థ బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

## పోలీసుల అదుపులో యూట్యూబర్ ధృవ్ రాఠీ

- దిల్లీ నిరసనలకు వెళ్లకుండా అడ్డగింత

**న్యూదిల్లీ, అక్టోబర్ 10:**

వివాదాస్పద యూట్యూబర్ ధృవ్ రాఠీని దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరియాణా గుర్గావ్ లోని సెక్టార్ 56లో ఉన్న తన నివాసం నుంచి అతడిని దిల్లీ పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల బెంగళూరులో సీజేపీ చేపట్టిన నిరసనలో ధృవ్ రాఠీ పాల్గొన్నాడు. ఇప్పుడు దిల్లీలో శనివారం జరగాల్సిన సీజేపీ ఆందోళనకు కూడా అతడు హాజరయ్యే అవకాశం ఉంది. అందుకే అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 50 మంది పోలీసులు ఉదయం 7.48 గంటల సమయంలో ధృవ్ రాఠీ ఇంటికి వెళ్లారు. అప్పుడు ఆయన తల్లి తలుపు తీయగా అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొంతకాలంగా విదేశాల్లో ఉంటున్న ధృవ్ రాఠీ.. సీజేపీ ఆందోళనల్లో పాల్గొనేందుకు ఇటీవల ఇండియా వచ్చాడు. అరెస్టుకు ముందు అతడు సీజేపీ ఆందోళనను ప్రభుత్వం అడ్డుకోవడంపై ఒక వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

**ఎక్కడికక్కడే నిర్బంధం**

దిల్లీ ప్రాంతంలో దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, దిల్లీ సహా అనేక ప్రాంతాల్లో 4,000 మందికి పైగా ఆందోళనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీక్షా స్థలి వద్దకు రాకుండా... కొందరిని ఇంట్లోనే హౌస్ అరెస్టు చేశారు. జంతర్ మంతర్ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. అలాగే, 50కిపైగా మెట్రో స్టేషన్లను మూసి ఉంచారు. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీలోని విద్యాసంస్థలు అన్నింటికీ శనివారం సెలవు ప్రకటించారు.

## ఢిల్లీని బందీగా మార్చనివ్వం

- విపక్షాల కుట్రను తిప్పికొడతామన్న రేఖా గుప్తా

**న్యూదిల్లీ, అక్టోబర్ 10:**

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు, పోలీసుల చర్యల నేపథ్యంలో రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపక్ష పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) అధినేత అరవింద్ కేజ్రీవాల్.. కాక్రోచ్ జనతా పార్టీ (CJP)తో కలిసి వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో రేఖా గుప్తా స్పందిస్తూ.. వరుస ఎన్నికల ఓటములను జీర్ణించుకోలేక కొన్ని పార్టీలు తమ రాజకీయ అసహనాన్ని ఢిల్లీ ప్రజలపై చూపిస్తున్నాయని విమర్శించారు.

# ఎంతమంది పోలీసులనైనా తెప్పించుకోండి

- వెనక్కి తగ్గేది లేదు!
- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 :**



ఎంతమంది పోలీసులను రంగంలోకి దించినా వెనక్కి తగ్గేది లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో పోలీసుల చర్యలపై స్పందిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. నాయకులను, యువతను అరెస్టు చేసినంత మాత్రాన తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. గత పది నుంచి పదిహేనేళ్లుగా ప్రధాని మోదీ, ఆరెస్సెస్‌లతో తాను రాజకీయంగా పోరాడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఒక ప్రత్యర్థిని పూర్తిగా అర్థం చేసుకున్నట్లే వారి రాజకీయ విధానాలను కూడా తాను అర్థం చేసుకున్నానని వ్యాఖ్యానించారు. నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు ఎంతమందిని మోహరించినా తమ నిర్ణయం మారదని స్పష్టం చేశారు. "మోదీ జీ.. మీకు నచ్చినట్లు చేయండి. పది వేల మంది, ఇరవై వేల మంది, యాభై వేల మంది.. ఎంతమంది పోలీసులనైనా రంగంలోకి దించండి. నాయకులను, యువతను, అందరినీ అరెస్టు చేయండి. అయినా మేము వెనక్కి తగ్గేది లేదు" అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు వీడియో సందేశంలో పేర్కొన్నారు. దేశ ప్రజల గొంతుకను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన రాహుల్ గాంధీ, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత పదిహేనేళ్లలో దేశానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పోరాడతామని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని తాము భావిస్తున్న రాజకీయ శక్తులను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొంటామని ప్రకటించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిరసనలకు అనుమతులు, శాంతిభద్రతల అంశాలపై పోలీసుల చర్యలు ఒకవైపు చర్చకు వస్తుండగా, రాజకీయ నిరసనల హక్కుపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

# 24 గంటల్లో సీజేపీ నేతల్ని విడుదల చేయాలి

- విడుదల చేయకపోతే నిరాహార దీక్ష చేపడతా.. సోనమ్ వాంగ్‌చుక్ అల్టిమేటం.!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 :**



ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న నేతల్ని, నిరసనకారుల్ని అరెస్ట్ చేశారు. మరోవైపు, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్‌లను శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే, ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీప్కే, కోకన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను విమానంలోని పోలీసులు అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతానికి తరలించారు. 2000 మందికి పైగా సీజేపీ, లెఫ్ట్ పార్టీల కార్యకర్తల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే, ఈ నిర్బంధంపై ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్పందించారు. అరెస్టైన సీజేపీ నేతల్ని 24 గంటల్లో విడుదల చేయకపోతే, తాను నిరాహార దీక్ష చేపడుతానని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అవసరమైనే పాదయాత్ర ద్వారా కూడా నిరసన తెలిపే అవకాశం ఉందని చెప్పారు. దేశంలో ''అప్రకటిత ఎమర్జెన్సీ'' వంటి పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదని అన్నారు. ఈ ఉద్యమానికి చాలా మంది నాయకత్వం వహించేందుకు ముందుకు రావడాన్ని చూసి సంతోషించానని, అయితే వారందర్నీ అరెస్ట్ చేయడం చూసి ఆందోళనకు గురయ్యానని అన్నారు.

# దసరాకి ఊరెళ్తున్నారా..



## ఈ పనులు చేసి వెళ్లడం తప్పనిసరి: బాలానగర్ ఏసీపీ

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** దసరా పండుగ కోసమని చాలా మంది ప్రజలు నగరాలు, పట్టణాలు విడిచి స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో తాళం వేసిన ఇండ్లే టార్గెట్ చేసి నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడుతున్నారు. విలువైన వస్తువులు, నగదు దోచుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పండగకు సొంతూర్లకు వెళ్లే ప్రజలకు బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి కొన్ని సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. దొంగల బారిన పడకుండా వీటిని తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఏసీపీ నరేష్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఊరికి వెళ్లినపుడు తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్లలో సమాచారం అందించాలని, దీని వల్ల పెట్రోలింగ్ పోలీసులు సంబంధిత నివాస గృహాలపై ప్రత్యేక నిఘా పెడుతారని స్పష్టం చేశారు. అలాగే ఇరుగు పొరుగుకు కూడా సమాచారం ఇవ్వాలని, మీ ఇంటికి సంబంధించి ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మీకు తెలియజేయాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఊరికి వెళ్లేటప్పుడు ఎక్కువ బంగారం, డబ్బు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని, బీరువాలో విలువైన వస్తువులుంటే వాటి తాళాలు ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లాలని చెప్పారు. మీరు ఊరు వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, నేరగాళ్లు తెలుసుకుని, మీ ఇల్లు ఖాళీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, తాళం బయటికి కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు, అందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానితులపై నిఘా ఉంచాలని, అలాంటి వారి గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపైనా అలర్ట్‌గా ఉండాలని, పండగ పేరిట వచ్చే ఆన్‌లైన ఆఫర్ల లింకులతో మోసపోవద్దని, బ్లూ కలర్ లింకులు అస్సలు ఓపెన్ చేయవద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరకు గిఫ్ట్ వచ్చిందని వచ్చే మెస్సేజ్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకున్నట్టయితే వెంటనే 1930కి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అత్యవసర సహాయం కోసం జాతీయ హెల్ప్‌లైన్ 112, 100కు కాల్ చేయాలని, పోలీసులకు ప్రజలు సహకరించాలని, పండుగను ఆనందోత్సాహంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు.

# హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుకు సిద్ధమవుతున్న టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ (Contempt of Court) పిటిషన్ దాఖలు చేసేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సిద్ధమవుతున్నారు. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టి డబ్ల్యూ జె ఎఫ్ యూనియన్ కు ప్రాతినిధ్యం ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆగస్టు 3వ తేదీన కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను ఆరు వారాల్లోగా అమలు చేయాలని కూడా ఆదేశించింది. అయితే గడువు ముగిసినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఆదేశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో (డీఎంఏ సి) తమ సంఘానికి ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు ప్రభుత్వ తీరును తప్పుబడుతూ, అన్ని జిల్లాల డీఎంఏ సి లలో టిడబ్ల్యూజేఎఫ్ కు ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆదేశించింది.హైకోర్టు తీర్పు, ఆదేశాలను నిర్ణీత గడువులోగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. అమలు చేయకపోతే అది న్యాయ వ్యవస్థను ధిక్కరించినట్లే అవుతుందని, అలాంటి సందర్భాల్లో బాధితులు 'కోర్టు ధిక్కరణ చట్టం, 1971' కింద కోర్టును ఆశ్రయించవచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు.ఇటీవల వివిధ ప్రభుత్వ విభాగాలు కోర్టు ఆదేశాలను పాటించకపోవడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, తమకు అనుకూలంగా వచ్చిన తీర్పును అమలు చేయకపోవడంతో బాధ్యులైన ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేసేందుకు మామిడి సోమయ్య తరపు న్యాయవాదులు పిటిషన్ ముసాయిదా సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే హైకోర్టులో దాఖలు కానుంది.ఈ ధిక్కరణ కేసులో సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల DPRO లను ప్రతివాదులుగా చేర్చనున్నట్లు సమాచారం.ఈ పిటిషన్ తోనైనా ప్రభుత్వంలో కదలిక వచ్చి హైకోర్టు ఆర్డర్ అమలు అవుతుందా? లేక సంబంధిత అధికారులు Contempt of Court Act కింద శిక్షకు గురవుతారా? అనేది వేచి చూడాలి

# శంకర్ పల్లి దోపిడీ కేసులో పాత నేరస్తుడి అరెస్ట్..

- మరో ఇద్దరు నిందితులు పరారీ...
- కత్తి, నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం పోలీసులు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంకర్ పల్లి పోలీసులు, ఫతేపూర్ బ్రిడ్జి సమీపంలోని స్క్రాప్ దుకాణంలో జరిగిన దోపిడీ కేసులో ఒక పాత నేరస్తుడిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అక్టోబర్ 8వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు పాత ఇనుప సామాన్లు అమ్మేందుకు వచ్చినట్లు నటిస్తూ స్క్రాప్ దుకాణంలోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న వారిని బెదిరించి రూ.25 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు దోచుకుని పరారయ్యారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు హైదరాబాద్‌లోని టోలిచౌకి, హకీంపేట్‌కు చెందిన మహ్మద్ రబ్బానీ (30)ని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు మహ్మద్ సోహైల్ ఖురేషీ, అస్లాం పరారీలో ఉన్నారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా ఒక కత్తి, రూ.3,500 నగదు, ఒక రెడ్‌మీ 5జీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన మహ్మద్ రబ్బానీతో పాటు పరారీలో ఉన్న మహ్మద్ సోహైల్, ఖురేషీపై గతంలో కూడా పలు క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై శంకర్ పల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 479/2026, బీఎన్ఎస్ సెక్షన్ 309(6), రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును శంకర్ పల్లి ఎస్‌హెచ్ఓ జి రుద్వీర్ కుమార్, చేవెళ్ల డివిజన్ డిఐ ఎల్ సమరం రెడ్డి, మోకిల క్రైమ్ టీమ్ కలిసి ఛేదించారు. చేవెళ్ల ఏసిపి బి కిషన్ మార్గదర్శకత్వంలో, చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్, ఐపిఎస్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రైమ్ టీమ్‌లో ఏఎస్ఐ నాగిరెడ్డి, పిసి నాగభూషణ్, పిసి యాదగిరి, హెచ్‌సి పాండరి, పిసి నవీన్ కుమార్, హెచ్‌జి రమేష్ పాల్గొన్నారు. దోపిడీ కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసు అధికారులు, క్రైమ్ టీమ్ సిబ్బంది పనితీరును అభినందించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో 18 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్ట్




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమంగా గంజాయి తరలిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, తనిఖీలు చేపట్టారు. నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో కానిస్టేబుళ్లు అమృత్ రెడ్డి, శిరీష, రాజు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బంది సహకరించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అశోక్ (26)గా గుర్తించామని, అతను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినికి చెందిన వ్యక్తి అని అధికారులు వెల్లడించారు. ఒడిశాలోని టిట్లాగఢ్ ప్రాంతం నుంచి నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు. అక్రమ మాదకద్రవ్యాలపై సమాచారం అందించండి దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, కోరారు. సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523 కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమ కార్యకలాపాలపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పండుగ సమయంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

## ప్రతిభా విద్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి: ప్రతిభా విద్యాలయం రామారెడ్డిలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంపటి నరసయ్య–శకుంతల జ్ఞాపకార్థం అన్నదానం

**400 మందికి అన్నదాన కార్యక్రమం**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో వెంపటి నరసయ్య,శకుంతల జ్ఞాపకార్థం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్ గేట్ ఎదురుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 400 మందికి అన్నదానం చేశారు. దివంగతుల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం,సేవాభావాన్ని చాటుకోవడం గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంపటి వెంకటేశ్వర్లు,యాదగిరి, కృష్ణమోహన్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కారు బైకు డి ఇద్దరికీ తీవ్ర గాయాలు

**వివరాలు తెలిపిన వికారాబాద్ సిఐ రఘు కుమార్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** కారు బైకు డి కొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ సిఐ రఘు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం సుమారు 11 గంటలకి వికారాబాద్ లోని శ్రీరాంనగర్ తండా దగ్గర ఒక స్కార్పియో వెహికల్ నెంబర్ టిఎస్ 34 కె 0909 గల దానిని నడుపు డ్రైవర్ హైదరాబాద్ నుండి తాండూర్ వైపు వెళుతుండగా శ్రీరామ్ నగర్ తాండ దగ్గర కొట్టాలగూడెం గ్రామానికి చెందిన పరమేశ్వర్, హరీష్ ఇద్దరు మోటార్ సైకిల్ పైన వస్తుండగా స్కార్పియో ముందు ఉన్న టు వీలర్ ని ఓవర్ టైక్ చేస్తూ ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ కి టక్కర్ ఇవ్వడంతో పరమేష్, హరీష్ లకు తీవ్ర గాయాలు కావడం జరిగింది. ఇద్దరిని ఇషా హాస్పిటల్ కి చికిత్స నిమిత్తం పంపగా ఇట్టి విషయం ఫోన్ ద్వారా తెలుసుకుని పరమేశ్వర్ తండ్రి అయిన పులిమద్ది వెంకటయ్య యొక్క ఫిర్యాదు మేరకు స్కార్పియో వెహికల్ నడుపుతున్న వెంకటేష్ గౌడ్ పైన కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# బతుకమ్మ పండుగ సంబరాలు

**షంషీగూడ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ పండుగ సంబరాలు**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి మండల్ షంషీగూడ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ సంబరాలు పాల్గొన్న ఉపాధ్యాయురాలు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పిల్లలతో రంగు రంగు పూలతో బతుకమ్మలను తయారు చేయించి బతుకమ్మ పాటలను పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు, పిల్లలకు పాటలతో పాటు సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగేటట్లు అన్ని పండుగలను ఇదే విధంగా పాఠశాలలో జరుపుతామని తెలియజేశారు.

# దేవీ నవరాత్రులలో డీజేలకు నో పర్మిషన్

**ఎస్సై టి. మురళి**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారి విగ్రహాల నిర్వాహకులతో రామారెడ్డి పోలీస్ స్టేషన్లో ఎస్సై మురళి సమావేశం నిర్వహించారు, విగ్రహాల వద్ద డీజేలు ఏర్పాటు చేయరాదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా సౌండ్ పొల్యూషన్ కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు.

# ప్రాచీన చారిత్రక సాక్ష్యాల ఆత్మఘోష

**నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం**

అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహ వంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకులలో అక్కడక్కడ నిక్షిప్తమై యున్న చరిత్ర కొంతవరకు వెలుగు లోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్ట మొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠాన్ లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెన వేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్ట లేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజా ప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజక వర్గం లోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాత వాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించ బడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం అవిభక్త రాష్ట్రంలో తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరో వైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



## తెలంగాణ ఉద్యమ ఆది గురువు

# కొండా లక్ష్మణ్

### నేడు బాపూజీ జయంతి

భారత స్వాతంత్ర్య పోరాటంలో , ముల్కీ ఉద్యమంలో , నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో , తెలంగాణ 1969 నాటి తొలి, ఇటీవలి మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ. ఏక కాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజాఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర వితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. అలనాటి నిజాం సంస్థానంలో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. చిన్నతనాన తల్లిని కోల్పోగా, ప్రాథమిక విద్య ఆసిఫా బాద్ లో, హైదరాబాద్ లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయ వాద వృత్తి చేపట్టాడు. ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించి, గెలిపించే వాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన , దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువు పై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతుడుగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలన పై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి, తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి ఆక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినెట్లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు. ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం చేసుకున్నాడు. 1973 లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన , ఇందిరా గాంధీ ఒప్పుకున్నా, నాటి హోం మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరా వు కు ముఖ్య మంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్ సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించు కోగా, 2002 లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా , కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా , జలదృశ్యం లోనే అంత్య క్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీగా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను , జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలు పెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# చరిత్రకు చిరునామా.. నిర్లక్ష్యానికి నిలువుటద్దం!

**నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం**



తెలంగాణ చరిత్రలో ఓ అపురూప అధ్యాయం.. శాతవాహనుల ఆనవాళ్లను తన గర్భంలో దాచుకున్న నేల.. వేల ఏళ్ల నాటి నాణేలు, పురావస్తు ఆధారాలతో చరిత్ర పరిశోధకులను ఆకర్షించిన ప్రాంతం.. అదే కోటిలింగాల. ఒకప్పుడు రాజరిక వైభవానికి కేంద్రంగా వెలుగొందిన ఈ ప్రాచీన ప్రాంతం నేడు గోదావరి కోత, పరిరక్షణ లోపం, పూర్తిస్థాయి పర్యాటక అభివృద్ధి జరగకపోవడం వంటి సమస్యల మధ్య తన ఉనికిని కాపాడుకునేందుకు ఎదురుచూస్తోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కోటిలింగాల చారిత్రక ప్రాధాన్యం, పరిరక్షణ మరోసారి చర్చకు వస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ ప్రాంతానికి ప్రాచీన చరిత్ర ఉంది. అందులో కోటిలింగాలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం జగిత్యాల జిల్లా వెల్గటూరు మండల పరిధిలో, గోదావరి-పెద్దవాగు సంగమ ప్రాంతంలో ఉన్న కోటిలింగాల.. శాతవాహనుల తొలి రాజకీయ కేంద్రాల్లో ఒకటిగా పురావస్తు పరిశోధనల్లో ప్రాధాన్యం పొందింది. ఇక్కడ నిర్వహించిన తవ్వకాల్లో లభించిన కోట అవశేషాలు, నాణేలు, మట్టిపాత్రలు, బ్రాహ్మీ లిపి ఆధారాలు ఈ ప్రాంత ప్రాచీనతను తెలియజేస్తున్నాయి. శాతవాహనుల ఆవిర్భావం, తొలి పాలకుల క్రమం, వారి ప్రారంభ రాజధాని వంటి అంశాలపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, కోటిలింగాలలో లభించిన నాణేల ఆధారాలు శాతవాహనుల తొలి చరిత్రను అధ్యయనం చేయడంలో అత్యంత కీలకమైనవిగా పురావస్తు పరిశోధకులు పరిగణిస్తున్నారు. కోటిలింగాల చరిత్ర వెలుగులోకి రావడంలో నాణేలది కీలక పాత్ర. ధర్మపురికి చెందిన చారిత్రక పరిశోధకుడు, పురావస్తు శాఖలో శాసన వ్యాఖ్యాతగా పనిచేసిన సంగనభట్ల నరహరిశర్మ ఈ ప్రాంతంలో అనేక పురాతన నాణేలను సేకరించి పురావస్తు శాఖకు అందించారు. వాటిలో శాతవాహనుల తొలి దశకు సంబంధించినవిగా భావించే నాణేలు ఉండటంతో కోటిలింగాల ప్రాధాన్యం మరింత పెరిగింది. 'రజో శాతవాహ', 'రజో సాతకంనిస' వంటి బ్రాహ్మీ లిపి గుర్తులతో కూడిన నాణేలు



సహా వివిధ పాలకులకు సంబంధించిన నాణేలు ఈ ప్రాంతంలో వెలుగుచూశాయి. శుంగులు, కాణ్వులు, శాతవాహనుల కాలానికి సంబంధించిన నాణేలపై పురావస్తు పరిశోధకులు అధ్యయనాలు చేశారు. ఈ ఆధారాలే తెలంగాణలో శాతవాహనుల తొలి రాజకీయ ప్రస్థానాన్ని అర్థం చేసుకునేందుకు కోటిలింగాలను కీలక కేంద్రంగా నిలిపాయి. కోటిలింగాల అంటే కేవలం నాణేల చరిత్ర మాత్రమే కాదు. ఇక్కడి పుట్టకోట గోడలు, ప్రాచీన నివాస ఆనవాళ్లు, సమీప ప్రాంతాల్లో కనిపించిన బౌద్ధ అవశేషాలు, జైన సంప్రదాయానికి సంబంధించిన గుర్తులు ఈ ప్రాంతానికి మరింత చారిత్రక వైవిధ్యాన్ని తీసుకొచ్చాయి. సమీపంలోని పాపాయిగాం గుట్ట ప్రాంతంలో బౌద్ధ ఆనవాళ్లు గుర్తించినట్లు పరిశోధనలు పేర్కొంటున్నాయి. గ్రామంలోని కోటీశ్వర ఆలయం మరో ఆకర్షణ. గోదావరి ఒడ్డున కనిపించే శిల్పాలు, ఆలయ నిర్మాణ శైలి మధ్యయుగ చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఒకే ప్రాంతంలో ప్రాచీన రాజకీయ చరిత్ర, బౌద్ధ-జైన ఆనవాళ్లు, ఆలయ సంప్రదాయం కనిపించడం కోటిలింగాల ప్రత్యేకత. ఇంతటి చారిత్రక సంపద ఉన్న ప్రాంతానికి ఇప్పుడు ప్రధాన సమస్య పరిరక్షణ. గోదావరి ఒడ్డున ఉండటంతో ఏటా వరదలు, ఒడ్డు కోత ప్రభావం పురావస్తు ప్రాంతంపై పడుతోందన్న ఆందోళన చాలా కాలంగా వ్యక్తమవుతోంది. మరిన్ని శాస్త్రీయ తవ్వకాలు చేపడితే కొత్త చారిత్రక ఆధారాలు బయటపడే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నప్పటికీ, సమగ్ర తవ్వకాలు, సంరక్షణ చర్యలు మరింత విస్తృతంగా చేపట్టాలన్న డిమాండ్ కొనసాగుతోంది. గోదావరి నుంచి చారిత్రక ప్రాంతాన్ని కాపాడేందుకు రక్షణ గోడ నిర్మించాలన్న ప్రతిపాదన కూడా ఏళ్లుగా వినిపిస్తోంది. ఆలంపూర్లో చారిత్రక కట్టడాలను పరిరక్షించిన తరహాలో కోటిలింగాల పురావస్తు ప్రాంతానికీ శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని చరిత్రాభిమానులు కోరుతున్నారు. కోటిలింగాలను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గతంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. వివిధ దశల్లో పర్యాటక సౌకర్యాల కల్పనకు ప్రయత్నాలు జరిగాయి. 2018లో పర్యాటకులను ఆకర్షించేందుకు 'శాతకర్ణి', 'పులోమావి' పేర్లతో బోట్లను ప్రారంభించారు. స్పీడ్ బోటును కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. హరిత హోటల్ తదితర పర్యాటక సదుపాయాల అభివృద్ధిపైనా చర్యలు చేపట్టారు. అయితే కోటిలింగాల చారిత్రక ప్రాధాన్యానికి తగిన స్థాయిలో సమగ్ర అభివృద్ధి, పురావస్తు పరిరక్షణ ఇంకా జరగాల్సి ఉందన్న అభిప్రాయం స్థానికులు, చరిత్రాభిమానుల్లో ఉంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం అంటే కొత్త పర్యాటక ప్రాంతాలను ప్రచారం చేయడమే కాదు.. ఉన్న చారిత్రక సంపదను భావితరాలకు అందించడం కూడా. కోటిలింగాలలో శాస్త్రీయ తవ్వకాలను విస్తరించడం, గోదావరి కోత నుంచి పురావస్తు ప్రాంతాన్ని రక్షించడం, మ్యూజియం ఏర్పాటు, సందర్శకులకు చరిత్రను వివరించే కేంద్రం, మెరుగైన రహదారులు, రవాణా, వసతి సదుపాయాలు కల్పిస్తే ఈ ప్రాంతాన్ని తెలంగాణలోనే ప్రముఖ చారిత్రక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. శాతవాహనుల చరిత్రను తన ఒడిలో దాచుకున్న కోటిలింగాల కోరుతున్నది భారీ హామీలు కాదు.. తన చరిత్రను చెరిగిపోకుండా కాపాడే శాశ్వత చర్యలు. ప్రపంచ పర్యాటక దినోత్సవం వేళైనా ఆ దిశగా అడుగులు పడితేనే ఈ ప్రాచీన నేలకు నిజమైన గౌరవం దక్కుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఒక్క ఓవరే కొంపముంచిందా?

**రెండో టీ20లో భారత్ ఓటమిపై**
## గవాస్కర్ విశ్లేషణ

- కుల్దీప్ బదులు మయాంక్, అర్ష్‌దీప్‌లలో ఒకరికి బంతి ఇవ్వాల్సిందని వ్యాఖ్య
- 249 పరుగులు చేసినా దక్కని విజయం
- షాయ్ హోప్ శతకంతో వెస్టిండీస్ సంచలనం
- బౌలింగ్ నిర్ణయమే మ్యాచ్‌ను మలుపు తిప్పిందన్న సన్నీ



**రాంచీ, అక్టోబర్ 10 :** భారీ స్కోరు సాధించినా విజయం ఎందుకు దక్కలేదు..? 249 పరుగులు చేసిన భారత జట్టు ప్రత్యర్థిని ఎందుకు నిలువరించలేకపోయింది..? రెండో టీ20లో వెస్టిండీస్ చేతిలో టీమిండియా ఓటమికి కారణమైన కీలక నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్‌లో ఒక ఓవర్ ఫలితాన్ని మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. ఆ సమయంలో కుల్దీప్ యాదవ్‌కు బదులుగా మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్‌లలో ఒకరికి బంతి ఇచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పేర్కొన్నాడు. రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగడంతో జట్టు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో టీమిండియా సునాయాసంగా గెలుస్తుందని భావించినప్పటికీ వెస్టిండీస్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. ఆరంభంలో మయాంక్ యాదవ్ మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. 36 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టిన అతడు భారత్‌కు ఆశలు కల్పించాడు. అయితే వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అజేయ శతకంతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. హోప్‌కు తోడుగా షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 84 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యంతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. రూథర్‌ఫోర్డ్‌ను కుల్దీప్ యాదవ్ అవుట్ చేసినప్పటికీ ఆ తర్వాత అతడికి మరో ఓవర్ ఇవ్వడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారిందని గవాస్కర్ విశ్లేషించాడు. ఆ సమయంలో వేగంగా బౌలింగ్ చేస్తున్న మయాంక్ లేదా అర్ష్‌దీప్‌ను ఉపయోగించి ఉంటే వెస్టిండీస్‌పై ఒత్తిడి కొనసాగించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమవడం, కీలక సమయంలో బౌలింగ్ మార్పులు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఓటమికి కారణాలుగా చర్చకు వచ్చాయి. అయితే కుల్దీప్ వేసిన ఒక్క ఓవరే ఓటమికి కారణమని కాకుండా, ఆ సమయంలో తీసుకున్న బౌలింగ్ నిర్ణయాన్ని గవాస్కర్ ప్రధానంగా ప్రశ్నించాడు. భారీ లక్ష్యాన్ని సైతం వెస్టిండీస్ ఛేదించడంతో భారత జట్టు బౌలింగ్ వ్యూహాలపై చర్చ మొదలైంది. 'భారీ స్కోర్ల మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ చేసిన పెద్ద పొరపాటు కుల్దీప్‌తో 17వ ఓవర్ వేయించడం. ఆ ఓవర్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 రన్స్ రావడంతో విండీస్ విజయం తేలికైంది. ఆ ఓవర్ గనుక మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ సింగ్‌లతో వేయించి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే.. అప్పటివరకూ మయాంక్ ఎకానమీ ఓవర్‌కు 12 ఉంది. అప్పటికీ విండీస్ విజయానికి మరిన్ని రన్స్ కావాలి. 17వ ఓవర్లో మరో వికెట్ లభించి ఉంటే.. మ్యాచ్ టీమిండియా వైపు తిరిగేది. అంతేకాదు 19వ ఓవర్లో శివం దూబేతో బౌలింగ్ చేయించడం సరైన నిర్ణయం కాదు. విండీస్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడుతున్నందున అతడి బదులు ఆ ఓవర్ కుల్దీప్ వేయాల్సింది' అని గవాస్కర్ పేర్కొన్నాడు. రాంచీలో థ్రిల్లింగ్ విక్టరీతో సిరీస్‌ను 1-1తో సమం చేసింది పర్యాటక జట్టు. ఐదు టీ20ల సిరీస్‌లో కీలమైన మూడో మ్యాచ్ అక్టోబర్ 11 ఆదివారం జరుగనుంది.



# గురి అదిరింది..
## చోళ చీఫ్స్ బోణీ కొట్టింది!

**కాకతీయ నైట్స్‌పై 6-2 తేడాతో ఘన విజయం**

**ఎనిమిది బాణాలతో పది పాయింట్ల గురి కొట్టిన అలెజాండ్రా**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ జట్టు విజయంతో శుభారంభం చేసింది. పీపుల్స్ ప్లాజా వేదికగా శుక్రవారం జరిగిన పోరులో కాకతీయ నైట్స్‌ను 6-2 తేడాతో ఓడించింది. చోళ చీఫ్స్ విజయంలో కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో కీలక పాత్ర పోషించింది. లీగ్‌లో అరంగేట్రం చేసిన ఆమె ఎనిమిది బాణాలను పర్ఫెక్ట్ పది పాయింట్ల లక్ష్యానికి గురిపెట్టి అద్భుత ప్రదర్శన చేసింది. చివరి సెట్‌లో చోళ చీఫ్స్ 80 పాయింట్లు సాధించగా, కాకతీయ నైట్స్ 79 పాయింట్లతో సరిపెట్టుకుంది. మరో మ్యాచ్‌లో చీరో ఆర్చర్స్ 6-2 తేడాతో రాజ్‌పుతానా రాయల్స్‌ను ఓడించింది. పృథ్వీరాజ్ యోధాస్ కూడా 6-2 తేడాతో మైటీ మరాఠాస్‌పై విజయం సాధించింది. శనివారం జరిగే పోటీల్లో మైటీ మరాఠాస్‌తో చోళ చీఫ్స్, పృథ్వీరాజ్ యోధాస్‌తో చీరో ఆర్చర్స్, రాజ్‌పుతానా రాయల్స్‌తో కాకతీయ నైట్స్ తలపడనున్నాయి.

# మ్యాట్ రెన్‌షా సూపర్ సెంచరీ

**డర్బన్ టెస్టులో అద్భుతంగా పుంజుకున్న ఆస్ట్రేలియా!**

**డర్బన్, అక్టోబర్ 10 :** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలకమైన డర్బన్ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు అద్భుతంగా పుంజుకుంది. సఫారీ పేస్ దళం ఉధృతికి తొలిరోజు ఆటలో కేవలం 84 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్.. మిడిలార్డర్ బ్యాటర్ మ్యాట్ రెన్‌షా (102 నాటౌట్) అజేయ శతకంతో జట్టును గట్టెక్కించాడు. వివాదాస్పద 'శాండ్‌పేపర్ గేట్' ఘటన తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడుతున్న కంగారూ జట్టు, ఈ మ్యాచ్‌తో పూర్తిగా గాడిలో పడింది. ఓవర్‌నైట్ స్కోర్ 187/6 తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (43) నుంచి అద్భుతమైన సహకారం లభించింది. తొలి రోజు ట్రావిస్ హెడ్ (9), మార్నస్ లబూషేన్ (37), స్టీవెన్ స్మిత్ (25), అలెక్స్ క్యారీ (14) వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు విఫలమైన చోట, రెన్‌షా క్రీజులో నిలదొక్కుకుని సఫారీ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించాడు. కెరీర్‌లో రెండో టెస్టు శతకాన్ని నమోదు చేసిన రెన్‌షా బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. భోజన విరామ సమయానికి ఆస్ట్రేలియా జట్టు 8 వికెట్ల నష్టానికి 277 పరుగులు సాధించి పటిష్ట స్థితిలో నిలిచింది. శతక వీరుడు రెన్‌షాకు తోడుగా నాథన్ లియన్ (8 నాటౌట్) క్రీజులో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో వియాన్ మల్డర్ (4/51) నాలుగు వికెట్లతో రాణించాడు.







# వయసు పెరిగినా..
## తగ్గని విధ్వంసం!

**37 బంతుల్లోనే డివిలియర్స్ మెరుపు శతకం**

**ఆస్ట్రేలియా ఛాంపియన్స్ బౌలర్లకు చుక్కలు**

**మైదానం నలువైపులా షాట్లతో చెలరేగిన మిస్టర్ 360**

**క్రికెట్‌కు వీడ్కోలు పలికినా తగ్గని బ్యాటింగ్ జోరు**

**ఐపీఎల్‌లోకి తిరిగి రావాలంటున్న అభిమానులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 :** వయసు పెరిగితే ఆటలో పదును తగ్గుతుందా..? క్రికెట్‌కు వీడ్కోలు పలికితే బ్యాట్ మూగబోతుందా..? దక్షిణాఫ్రికా మాజీ విధ్వంసక బ్యాటర్ ఏబీ డివిలియర్స్ మాత్రం తన ఆటతో ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకప్పుడు బౌలర్లకు చుక్కలు చూపించిన మిస్టర్ 360 మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ పోటీల్లో ఆస్ట్రేలియా ఛాంపియన్స్‌పై కేవలం 37 బంతుల్లోనే శతకం బాది అభిమానులను అలరించాడు. మైదానం నలువైపులా బంతులను తరలిస్తూ ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తనదైన వినూత్న షాట్లు, భారీ బాదుడుతో పరుగుల వరద పారించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఏళ్లు గడుస్తున్నా తన బ్యాటింగ్‌లో పదును ఏమాత్రం తగ్గలేదని చాటిచెప్పాడు. ఒకప్పుడు ప్రపంచంలోని మేటి బౌలర్లను సైతం తన విధ్వంసక ఆటతో ఇబ్బంది పెట్టిన డివిలియర్స్ మరోసారి పాత రోజులను గుర్తుచేశాడు. డివిలియర్స్ మెరుపు శతకంతో అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికీ అదే జోరుతో పరుగులు సాధిస్తున్న అతడు ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకోవాలంటూ కొందరు అభిమానులు కోరుతున్నారు. క్రికెట్‌కు దూరమైనా తనలోని విధ్వంసక బ్యాటర్ ఇంకా సజీవంగానే ఉన్నాడని డివిలియర్స్ ఈ ఇన్నింగ్స్‌తో మరోసారి నిరూపించాడు.

# టీమిండియాతో చరిత్రాత్మక సిరీస్..

**15 మందితో కూడిన జింబాబ్వే మహిళల జట్టు ప్రకటన!**



**హైదరాబాద్, అక్టోబర్ 10 :** అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయానికి జింబాబ్వే మహిళల జట్టు సిద్ధమైంది. ఇటీవల వెస్టిండీస్‌పై అద్భుత విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆ జట్టు, మొట్టమొదటి ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 16 నుంచి టీమిండియాతో వైట్‌బాల్ (టీ20, వన్డే) సిరీస్‌లో ఆఫ్రికా జట్టు తలపడనుంది. ఈ నేపథ్యంలో జింబాబ్వే క్రికెట్ బోర్డు శనివారం 15 మందితో కూడిన పటిష్టమైన మహిళల జట్టును ప్రకటించింది. జోసెఫినె కొమో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌కు సంయుక్త ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తున్న జింబాబ్వే జట్టుకు, భారతగడ్డపై భారత్‌తో సిరీస్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. అక్టోబర్ 16న తొలి టీ20తో ఈ పర్యటన ప్రారంభంకానుంది. అక్టోబర్ 18న రెండో టీ20, అక్టోబర్ 20న మూడో టీ20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆ తర్వాత అక్టోబర్ 23 నుంచి 28వ తేదీ వరకు ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ కొనసాగనుంది. మరోవైపు, ఇటీవలే భారత జట్టు టీమ్ కమాండ్ చేపట్టిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు, స్వదేశంలో వైట్‌బాల్ కెప్టెన్‌గా ఇదే తొలి ప్రధాన సిరీస్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**జింబాబ్వే మహిళల జట్టు:**

జోసెఫినె కొమో (కెప్టెన్), బిలవ్డ్ బిజా, చిపో ముగేరి-తిరిపనో, కెలిస్ ధలోవు, మిచెల్లే మవుంగా, ఫ్రాన్సిస్కా చిపరే, ఒలిండర్ చారే, కడ్జాయి చిగోర, యశా గ్వాంజుర, నొమవెలో సిబండా, లొరిన్ ఫిరీ, చియెడ్జ ధురురు, మొడెస్టర్ ముపచిక్వా, తెండాయ్ మకుషా, ప్రాషే మేయర్స్.






# అలియాస్ రుక్మిణీ ఎవరు?

## నితిన్ సినిమాలో బాలీవుడ్ భామ!

## టైటిల్ పాత్రలో ఆఫియా సయ్యద్ అంటూ ప్రచారం

## డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం

**హైదరాబాద్, అక్టోబర్ 10 :** అసలు ఆ రుక్మిణీ ఎవరు..? నితిన్ కొత్త సినిమాలో టైటిల్ పాత్ర పోషించబోయే కథానాయిక ఎవరు..? చిత్రబృందం హీరోయిన్ పేరును రహస్యంగా ఉంచడంతో సినీ అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. 'భీష్మ' తర్వాత ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయిన హీరో నితిన్ ఈసారి 'అలియాస్ రుక్మిణీ' చిత్రంతో విజయాన్ని అందుకోవాలని చూస్తున్నాడు. 'దండోరా' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను నాని నిర్మాణ సంస్థ యూనానిమస్ ప్రొడక్షన్ సమర్పణలో దీప్తి గంటా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 4న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు అక్టోబర్ 9న చిత్రబృందం ప్రకటించింది. అయితే కథానాయిక ఎవరనే విషయాన్ని వెల్లడించకపోవ డంతో రుక్మిణీ పాత్ర చుట్టూ ఆసక్తికరమైన ప్రచా రం మొదలైంది. ఈ చిత్రంలో రుక్మిణీ పాత్రను బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ పోషించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాద్‌వాలా మేనకో డలిగా చెబుతున్న ఆఫియా ఇటీవల 'ప్రేమ్ కీటాను' చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. మలయాళంలో విజయవంతమైన 'ప్రేమలు' చిత్రానికి రీమేక్‌గా తెరకెక్కిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు 'అలియాస్ రుక్మిణీ'లో నితిన్ కృష్ణ అనే పాత్రలో కనిపించనున్నాడు. కథానాయిక పాత్రకు కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందనే ఆసక్తి టైటిల్‌తోనే నెలకొంది. అయితే రుక్మిణీగా ఆఫియా సయ్యద్ నటిస్తున్నారనే ప్రచారంపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అక్టోబర్ 13న హీరోయిన్ ఎవరనే విషయాన్ని వెల్లడిస్తామని ప్రకటించింది. దీంతో ప్రచారంలో ఉన్నట్లుగా ఆఫియానే రుక్మిణీగా కనిపించనుందా..? లేక చిత్రబృందం మరో కథానాయికను పరిచయం చేయనుందా..? అనే ఉత్కంఠకు మంగళవారం తెరపడనుంది.



# ఒక్కో సినిమాకు రూ.8 కోట్ల పారితోషికమా?

## ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ!

హైదరాబాద్, అక్టోబర్ 10 : సినీ ఇండస్ట్రీలో ఒక భారీ విజయాన్ని అందుకున్న తర్వాత నటీనటుల పారితోషికాలపై రకరకాల ఊహాగానాలు, వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తారల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉ ంటుంది. ఈ క్రమంలోనే 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న నటి శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై శ్రీనిధి శెట్టి స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. తన పారితోషికంపై వస్తున్న వార్తలను శ్రీనిధి శెట్టి పూర్తిగా ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ మెం-త్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నాననే ప్రచారం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. కేవలం టైమ్‌పాస్ కోసం కొందరు వ్యాప్తి చేసే పుకార్ల ఆధారంగా ఇలాంటి రూమర్లను నమ్మవద్దని ప్రేక్షకులు, అభిమానులకు సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునే క్రమంలో తాను పారితోషికానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనని, కేవలం డబ్బు సంపాదించడమే తన లక్ష్యమైతే 'కేజీఎఫ్' విజయాన్ని ఆసరాగా చేసుకుని గత కొన్నేళ్లలో 30 నుంచి 40 ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని ఆమె తెలిపారు. తన నటనకు ప్రాధాన్యం ఉన్న మంచి కథలు, నాణ్యమైన పాత్రలకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని శ్రీనిధి శెట్టి తేల్చిచెప్పారు. సరైన కథ లభిస్తే పారితోషికం విషయంలోనూ చర్చలకు సిద్ధంగా ఉంటానని, ఒక నటిగా ప్రేక్షకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేయడమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన శ్రీనిధి శెట్టి మోడలింగ్ రంగాన నిలిచి 2016లో 'మిస్ సుప్రానేషనల్' కిరీటాన్ని గెలుచుకున్నారు. ఆ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు.



# ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు?

## ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై మృణాల్ ఠాకూర్ ఆగ్రహం!

హైదరాబాద్, అక్టోబర్ 10 : సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు మరియు రూపురేఖలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా పెరిగిపోతున్న ట్రోలింగ్‌పై టాలీవుడ్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల కాలంలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్ మరియు ఆన్‌లైన్ విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు. తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా జీవించే హక్కు ఉంటుందని, ఎవరో తెర వెనుక కూర్చుని ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని మృణాల్ స్పష్టం చేశారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేసి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. వారి కష్టాన్ని, విజయాలను విస్మరించి కేవలం చిన్న చిన్న విషయాలపై విమర్శలు గుప్పించడం సరికాదని అన్నారు. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్లుగా అనిపిస్తోందని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకు ప్రముఖ నటి కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలపై నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. తల్లి అయిన తర్వాత మహిళల శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ నగల ప్రకటనలో ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ యాడ్ వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో స్పందించిన మృణాల్ ఠాకూర్.. మహిళల శరీరాకృతి, దు-స్తులు మరియు వ్యక్తిగత జీవితాలపై కొద్దిమంది సోషల్ మీడియా వేదికగా నిత్యం అసభ్యకరమైన కామెంట్లు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఇలాంటి మానసిక వేధింపులను ఎదుర్కొంటున్నారని, ఇకనైనా ఈ సంస్కృతి మారాలని ఆమె హితవు పలికారు.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com